క్లుప్తంగా

వైభవంగా పల్లకి సేవ



ప్రత్యేకాలంకరణలో స్వామి

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవ స్థానంలో శనివారం స్వామి, అమ్మవార్ల పల్లకి సేవ వైభవంగా జరిగింది. ప్రత్యేకాలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు: మండలంలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న వెంకయ్యస్వామి మందిరంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు స్వామికి పంచామృతాభిషేకం చేశారు. ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పలువురు హోమ గుండం వేసి ధుని పూజ చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమానికి గంధళ్ల కృష్ణయ్య – అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ




రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవను అర్చకులు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను అలంకార మండపంలో తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉదయం నిత్యకల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిగింది.

భక్తిశ్రద్ధలతో యాగం



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో పుత్రకామేష్టి యాగాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సంతాన సాఫల్యత కోసం వివిధ ప్రాంతాల నుంచి 100 మందికిపైగా దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఉభయకర్తలుగా అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా- గీతాంజలి, సురేంద్రనాథ్‌గుప్తా- అన్నపూర్ణ దంపతులు వ్యవహరించారు. నిర్వాహకులు అమరా మోహన్‌రావు, తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, హనుమంతరావు, ఆంజనేయులు, టి.వెంకటకిశోర్‌కుమార్, కె.శివప్రసాద్ పాల్గొన్నారు.

14న ఎస్టీ వర్గీకరణ సభ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈనెల 14న ఎస్టీ వర్గీకరణ భేరీ సభను ఏర్పాటు చేస్తున్నట్లు యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య అన్నారు. హలో యానాది.. చలో నెల్లూరు.. అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో శనివారం ఆవిష్కరించారు. యానాదులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. యానాది, గిరిజన ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చేవూరు సుబ్బారావు యానాది, ఉద్యోగుల సంఘం జిల్లా చైర్మన్ రాపూరు కృష్ణయ్య, నాయకులు మానికల మురళి, చెంబేటి ఉష, కల్లూరు వరలక్ష్మి, తిరివీధి సతీష్ చంద్ర, పెంచలప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

పొదలకూరు: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పొదలకూరు బిట్ – 4 ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుడిగా, సామాజికవేత్తగా, రాజకీయవేత్తగా దేశానికి జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఆలుపూరు పావయ్యమాదిగ, జనరల్ సెక్రటరీ చిడతల శ్రీనివాస్, బొమ్మి పెంచల ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

➡ జగ్జీవన్‌రామ్‌కు ఎంఈఎఫ్ సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలువాయి శీనయ్య, నేలటూరు బుజ్జయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉదయ్‌మాదిగ, ఎంఈఎఫ్ నాయకుడు పి.పెంచలయ్య, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

➡ టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వెంకటరమణయ్య మాట్లాడారు.

➡ **వెంకటాచలం:** మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జగజ్జీవన్‌రాం జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ జి.విజయానంద్‌కుమార్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

➡ **కొడవలూరు :** సామాజిక న్యాయం కోసం పోరాడిన యోధుడు జగ్జీవన్‌రామ్ అని పంచాయతీ కార్యదర్శి షేక్.షబ్బీర్ కొనియాడారు. మండలంలోని గౌతమ్‌నగర్ సచివాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డీఏ గౌతమ్‌రామ్, వీఏఏ శ్రావ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ శశి ప్రియదర్శిని, సర్వేయర్ అద్భుతరాణి, మహిళా పోలీస్ తేజస్వి, ఏఎన్ఎం వితలమ్మ పాల్గొన్నారు.

➡ **కొడవలూరు (బుచ్చిరెడ్డిపాళెం) :** బుచ్చిరెడ్డిపాళెం సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు బట్ట ప్రవళిక, నాయకులు బీమతాటి వెంకటరమణయ్య, విల్సన్, వార్డెన్ సునీల్ పాల్గొన్నారు.

➡ **మనుబోలు:** బాబూ జగ్జీవన్‌రామ్ నేటి తరానికి ఆదర్శనీయుడని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎంతగానో కృషి చేశారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు నాగార్జునరెడ్డి, మురళీధర్, శీనమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

➡ **కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం) :** బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ శ్రీహరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఈ గోపిచంద్రారెడ్డి, ఏఓ మంజులమ్మ, జూనియర్ అసిస్టెంట్ రామారావు పాల్గొన్నారు.

➡ **కోవూరు:** మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నిర్మలానందబాబా, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

➡ **ఇందుకూరుపేట :** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైద్యాధికారులు బ్రహ్మేశ్వరనాయుడు, కిశోర్‌కుమార్ నివాళులర్పించారు.



వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీలో నివాళులర్పించిన అధ్యాపకులు, విద్యార్థులు



పొదలకూరు: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసిన నేతలు



కొడవలూరు : గౌతమ్‌నగర్‌లో..



మనుబోలు మండల పరిషత్ కార్యాలయంలో..



బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో..



కోవూరు : తహసీల్దార్ కార్యాలయంలో..



కోవూరు : ఎంపీడీఓ కార్యాలయంలో..



ఇందుకూరుపేట తహసీల్దార్ కార్యాలయంలో..

క్రమశిక్షణతో ఉండాలి

• ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



మాట్లాడుతున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వివేకానంద హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలకు శనివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1,500 మంది విద్యార్థులతో వివేకానంద హైస్కూల్ నాణ్యమైన విద్యను అందిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ రామ సుబ్బారెడ్డి, అపస్మా నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

• ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పట్టణంలోని 5, 6, 7 వార్డుల్లో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డ్రెయినేజీ, తాగునీరు, రోడ్ల విషయమై స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల విజ్ఞప్తి మేరకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని వివరించారు. వార్డుల్లో సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన మురళీధర్ బైక్‌పై గొలగమూడికి బయలుదేరాడు. సర్వేపల్లి కాలువ సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మురళీధర్‌కు గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

15 నుంచి చేపల వేట నిషేధం

ముత్తుకూరు: బంగాళాఖాతంలో ఈనెల 15వ తేదీ నుంచి చేపల వేటపై నిషేధం విధిస్తూ ఫిషరీస్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్టు మత్స్యశాఖ అధికారులు శనివారం తెలిపారు. ఈ 'ఇండియన్ ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్' (ఈఈజెడ్)లో రెండునెలలపాటు వేటకు విరామం ప్రకటించారన్నారు. జూన్ 14వ తేదీ నుంచి వేట పునఃప్రారంభించాలన్నారు. బంగాళాఖాతం తీరంలోని అన్ని రాష్ట్రాలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. మోటార్ లేని సంప్రదాయ పడవలకు మాత్రం ఈ నిషేధం వర్తించదని అధికారులు వెల్లడించారు.



కృష్ణపట్నం తీరంలో బోట్లు

ఘనంగా మారిటైమ్ దినోత్సవం

ముత్తుకూరు: మండలంలోని అదానీ కృష్ణపట్నం పోర్టులో శనివారం 62వ జాతీయ మారిటైమ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. 'సమృద్ధి సాగర్ – వికసిత్ భారత్' నినాదంతో నీలి ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందాలని ఉద్యోగులు ఆకాంక్షించారు. కేక్ కట్ చేసి, సందడి చేశారు. తూర్పు తీరంలో కృష్ణపట్నం పోర్టు సుప్రసిద్ధం కావాలని ముక్తకంఠంతో కోరారు. పోర్టు ఉద్యోగులతోపాటు ఇండియన్ కోస్టుగార్డు, మెరైన్ పోలీస్, కస్టమ్స్, షిఫ్ మాస్టర్స్, వెస్సల్ ఏజెంట్లు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పోర్టు ఉద్యోగులు

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జిల్లాలో ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఆటో కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో సురేష్ పాల్గొని, మాట్లాడుతూ జిల్లాలో ఆటోలపై ఆధారపడి 50 వేల మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులపై జీఓ నంబర్ 21 పేరుతో ఆర్థిక భారాన్ని మోపుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ అమలు చేసిన వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మల్లికార్జున, షేక్ జానీబాషా, రాధయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆటో కార్మిక సంఘం నాయకులు

సీహెచ్‌సీలో వసతుల పరిశీలన



ఆస్పత్రి వద్ద వైద్యాధికారులతో కంట్రోల్ టీమ్

పొదలకూరు: కాయకల్ప అవార్డు ఎంపికకు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని స్టేట్ క్వాలిటీ కంట్రోల్ టీమ్ శనివారం పరిశీలించింది. గతంలో రెండు పర్యాయాలు సీహెచ్‌సీ కాయల్ప అవార్డుకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో కాయకల్ప క్లినిక్ పర్సస్ డాక్టర్ రామేశ్వర ప్రసాద్, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ క్రాంతికుమార్ ఆస్పత్రి పరిసరాలు, మరుగుదొడ్ల శుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. వారి వెంట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్, ఇతర వైద్యాధికారులున్నారు.

నేడు సీతారాముల కల్యాణం

పొదలకూరు: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైభవంగా శ్రీసీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని దేవస్థాన నిర్వాహక కమిటీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉభయకర్తలుగా అమరావతి స్కూల్ కరస్పాండెంట్ కె.సురేష్ – మంజుల దంపతులు వ్యవహరిస్తారన్నారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి



సమావేశంలో పాల్గొన్న నేతలు

నెల్లూరు (టౌన్) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏ, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేతన సవరణ కమిటీ జాప్యం తగదన్నారు. పీఆర్సీ, ఐఆర్‌లను వెంటనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శి నరసింహం, ఆర్థిక కార్యదర్శి సుమన్, గౌరవాధ్యక్షుడు రాజమనోహర్, అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా పరిశీలకుడు ధనుంజయనాయుడు పాల్గొన్నారు.

'సమస్యల్ని పరిష్కరించకపోతే ఎలా?'



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు

• మీరు డబ్బులిస్తేనే తీసుకున్నాం
• మేము అడగలేదు

ఇందుకూరుపేట: 'ఎన్నికల్లో ఓట్ల కోసం మీరు డబ్బులిస్తేనే తీసుకున్నాం.. మీ దగ్గరకు వచ్చి మేము అడగలేదు.. ఇప్పుడు మా సమస్యలను పరిష్కరించకపోతే ఎలా?' అని మండలంలోని మైపాడు బీసీ కాలనీ మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. మురుగునీరు ఇప్పటికే నివాసాల్లోకి చేరి ఇబ్బంది పడుతుంటే డ్రెయినేజీలు ఏర్పాటు చేయకుండా రోడ్లు ఎలా వేస్తారని మహిళలు శుక్రవారం నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కాగా దీనిపై టీడీపీ నాయకులు ఆ ప్రాంతానికి వెళ్లి మహిళలను దూషిస్తూ 'మా దగ్గర డబ్బులు తీసుకోలేదా..' అంటూ నిందించడంపై వారు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మా బాధలు చెప్పుకుంటూ పనిచేయాలని కోరితే మీరు దౌర్జన్యానికి పాల్పడడం సరికాదని వాపోయారు. గతంలోనే డ్రెయినేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, ఆమె సానుకూలంగా స్పందించారని, అందుకే ఇప్పుడు డ్రెయినేజీని ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. అయితే ప్రస్తుతం అందరు కట్టకట్టుకుని వచ్చి మాపై ఇలా ప్రవర్తించడం సరికాదని, మీకు తగిన బుద్ధి చెబుతామని టీడీపీ నాయకులను మహిళల హెచ్చరించారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 454 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 331 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 123 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ. 230, సరాసరిన రూ.262.52 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి వి.మహేష్‌కుమార్ తెలిపారు. కాగా వేలంలో 10 కంపెనీలు పాల్గొన్నాయి.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పెనుబల్లి గ్రామంలో రైతు కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మర్ స్వచ్ఛంద సంస్థ వారు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలతో పాటు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష యోజన, సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాల గురించి వివరించారు. బీమా కలిగి ఉండడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రూపేష్‌బాబు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెల్లూరు సిటీ: మతిస్థిమితం లేని వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సౌత్ ట్రాఫిక్ స్టేషన్ పోలీసుల శనివారం వివరాలు వెల్లడించారు. బాలరాజు (70) అనే వృద్ధుడికి మతిస్థిమితం లేదు. ఈనెల 2వ తేదీన బాలరాజును వేద సంస్కృతి పాఠశాలకు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.